
సాక్షి ఒడిశా

మంగళవారం । 1 । జులై । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4,85,732

బంగారం : 100 మిల్లీ గ్రాములు

వెండి : 10 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



బీఎంసీ కమిషనర్‌పై దాడి

బీఎంసీ కమిషనర్‌పై దాడి జరిగింది. దాడిని ముక్తకంఠంతో ఖండించారు.

- 8లో



గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి జిల్లాలో 60 కిలోల గంజాయి దొరికింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

హెచ్‌ఎంను బదిలీ చేయాలని ఆందోళన



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి గడ్డిశెశిఖాల్ పంచాయతీలోని మండలపితేసు గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలను బదిలీ చేయాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు సోమవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేసారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 15 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ హెచ్‌ఎంతోపాటు మరొకరు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రధానోపాధ్యాయురాలు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఉన్న ఒక ఉపాధ్యాయురాలు కూడా అప్పుడప్పుడు విధులకు హాజరవుతుండడంతో తమ పిల్లలు పాఠాలు నేర్చేందుకు కష్టతరమవుతుందని.. ఇదే కొనసాగితే పిల్లల భవిష్యత్ అగమ్య గోచరంగా మారుతుందని వారంతా అన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎంను బదిలీ చేస్తే పాఠశాలలో చదువులు మెరుగుపడతాయని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

యాత్ర కోసం వెళ్లిన యువకుడు శవమయ్యాడు!



పింటూ కలక (ఫైల్)

రాయగడ: జగన్నాథ రథయాత్ర చూసేందుకు వెళ్లిన యువకు శవమై దర్శనమించారు. జిల్లాలోని బిసంకటక్ పోలీస్ స్టేషన్ పరిధి దుర్గి సమీపంలోని మామిడి తోటలో యువకుని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడు డుమునిలి పంచాయతీ లొట్టగుడ గ్రామానికి చెందిన జొగులు కలక కుమారుడు పింటూ కలక (21)గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివరాల్లోకి వెళితే.. జూన్ 27వ తేదీన జగన్నాథ రథాయత్ర చూసేందుకు పింటు బిసంకటక్ వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే యాత్ర ముగిసి మూడు రోజులు అవుతున్నా ఇంటికి తిరిగి రాకపోవడంతో బిసంకటక్ పోలీస్ స్టేషన్‌లో పింటు తండ్రి జోగులు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం డుమునిలి -దుర్గి సమీపంలో దుర్గంధం వెదజల్లడంతో అటువైపుగా వెళుతున్న కొందరు మామిడితోటలోకి వెళ్లి చూడగా.. యువకుడు ఉరివేసుకుని చనిపోయి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహం పింటుదిగా గుర్తించి వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇది హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

- వరద పరిస్థితి అదుపులో ఉంది: మంత్రి పూజారి
- క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన

బాలాసోర్‌లో.. ఉప్పొంగుతున్న నదులు



విపత్తు నిర్వహణ, సహాయ కమిషన్ అధికార వర్గాలతో రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సమీక్ష సమావేశం

భువనేశ్వర్: జార్ఖండ్, ఉత్తర ఒడిశాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. బాలాసోర్ జిల్లాలో ప్రముఖ నదులు వరదతో ఉప్పొంగుతున్నాయి. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలతో దిగువ ప్రాంతాల నదులలో నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. పొరుగు జిల్లా మయూర్‌భంజ్ కూడా వరద ముంపు అంచుల్లో ఉన్నట్లు భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. బుధాబలంగా, జలకా, వైతరణి వంటి ఇతర నదులు తాత్కాలికంగా ఉప్పొంగి శాంతిస్తున్నాయి. జార్ఖండ్‌లోని చండిల్ ఆనకట్ట నుంచి అకస్మాత్తుగా నీటిని విడుదల చేయడంతో సువర్ణ రేఖ నది వరదతో ఉప్పొంగుతోంది. సువర్ణ రేఖ నదిలో నీటి మట్టం పెరుగుతుండడంతో బాలాసోర్, మయూర్‌భంజ్ జిల్లాలు వరదలతో సతమతం అవుతున్నాయి. ఉప్పొంగుతున్న నదీ తీర ప్రాంతాలకు ప్రభుత్వం హై అలర్ట్ జారీ చేసింది. వరదల ఉధృతిని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి అనుబంధ అధికార యంత్రాంగంతో సమావేశమై సమీక్షించారు.

అధికారిక వర్గాల సమాచారం ప్రకారం సువర్ణ రేఖ, బుధాబలాంగ్ నదులు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జార్ఖండ్‌లోని పరీవాహక ప్రాంతంలో నిరంతర వర్షాలు కురుస్తున్న కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. బాలాసోర్ జిల్లాలోని రాజ్‌ఘాట్ వద్ద సువర్ణ రేఖ నది వద్ద నీటి మట్టం ప్రమాద పరిమితి దాటిందని జల వనరుల శాఖ తెలిపింది. నీటి మట్టం 11.52 మీటర్లకు పెరిగి 10.36 మీటర్ల ప్రమాద గుర్తును అధిగమించింది. మథాని వద్ద జలకా నది నీటి మట్టం 6.84 మీటర్లు గరిష్ట పరిమితికి మించి 6.50 మీటర్ల ఎత్తున ప్రవహిస్తుంది. 5వ నంబరు జాతీయ రహదారి వద్ద బుధాబలంగా నది ప్రస్తుత నీటి మట్టం 7.20 మీటర్లు కొనసాగుతుంది. ఈ నది ప్రమాద సంకేతం 8.13 మీటర్లు. ఈ పరిస్థితుల దృష్ట్యా వరద పరిస్థితి అదుపులోనే ఉందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి హామీ ఇచ్చారు. వరద ముంపుతో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. పరిస్థితి గురించి, ముఖ్యంగా చండిల్ అసంపూర్ణ ఆనకట్ట స్థితిగతుల గురించి నిరంతరం జార్ఖండ్ ప్రభుత్వంతో సంప్రదిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. నదుల ప్రవాహాన్ని యంత్రాంగం నిశితంగా పర్యవేక్షిస్తోంది. అవసరమైన చోట కట్టలను బలోపేతం చేస్తోందని మంత్రి అభయం ఇచ్చారు.

మంత్రి సమాచారం ప్రకారం బుధాబలాంగ్ నది నీటి మట్టం క్రమంగా దిగజారుతుంది. సువర్ణ రేఖ నది నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం వర్షపాతం లేనందున ఈ రెండు నదుల్లో నీటి మట్టంలో స్వల్ప హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా. అంచనా ప్రకారం వానలు కురిస్తే జలేశ్వర్, ఇతర లోతట్టు ప్రాంతాలను కొంత మేరకు ప్రభావితం చేస్తుంది. ఒడిశా ప్రభుత్వం వరద పరిస్థితిని ముందస్తుగా నిర్వహిస్తోంది, సెంట్రల్ రేంజ్ ఆర్‌డీసీ, ఇతర అధికారులు ప్రత్యక్షంగా వరద ఉధృతిని నిరంతరం సమీక్షిస్తున్నారు. వరద నీరు విడుదల నియంత్రణతో సువర్ణ రేఖ మరియు బుధాబలాంగ్ నదుల నీటి మట్టం త్వరలో తగ్గుతాయని మంత్రి సురేష్ కుమార్ పూజారి అభిప్రాయం వ్యక్తం చేశారు.


రానున్న 24 గంటలు కీలకం: ఈఐసీ

ఉత్తర ఒడిశా, జార్ఖండ్‌లో భారీ వర్షపాతం నమోదవుతోంది. దీని ప్రభావంతో ఉత్తర ఒడిశాలో పెను వరద ముప్పు పొంచి ఉందని జల వనరుల శాఖ అత్యున్నత ఇంజనీర్ (ఈఐసీ) తెలిపారు. రానున్న 24 గంటలు చాలా కీలకం అన్నారు. వరద పరిస్థితి వర్షపాతంపై ఆధార పడి ఉంటుందన్నారు. సువర్ణ రేఖ, బుధాబలంగొ మరియు జలకా 3 నదులలో నీటి మట్టం పెరిగింది, వరద పరిస్థితి పొంచి ఉంది. ఈ పరిస్థితిని అనుక్షణం సమీక్షిస్తున్నట్లు వివరించారు.

చీఫ్ సెక్రటరీ పర్యవేక్షణ

ఉత్తర ఒడిశాలో వరద ఉధృతి పరిస్థితుల్ని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన బాలాసోర్‌లో రాష్ట్ర జలసంబంధ సమాచారం కేంద్రాన్ని సందర్శించారు. జల వనరులు శాఖ అదనపు ప్రముఖ కార్యదర్శి, అభివృద్ధి కమిషనరు అనూ గర్గ్ ఆయనకు పలు ప్రాంతాల్లో పొంగి పొర్లుతున్న నదుల నీటి మట్టం వివరాల తాజా సమాచారం విశ్లేషించారు.

బలియాపాల్ మండలంలో సువర్ణ రేఖ కుడి కాలువ గట్లు తెగిపోకుండా రసూల్‌పూర్ స్లూయిస్‌ను ఇసుక సంచులతో పటిష్టత కల్పించినట్లు విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఐసీ) వివరించారు. జల వనరుల ఇంజినీర్ల 4 బృందాలు సదర్, బొస్తా, బలియాపాల్ మరియు భొగొరాయ్ మండలాల్లో వివిధ మార్గాలను తనిఖీ చేస్తున్నారని తెలిపారు. బాలేశ్వర్ జిల్లాలో ప్రస్తుతం వరద పరిస్థితి అదుపులో కొనసాగుతుంది. బలియాపాల్ మండంలో 2 గ్రామాలు, భొగొరాయి మండలంలో 2 గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఏ ఒక్క ఇల్లు వరద ముంపునకు గురి కాలేదని జల వనరుల విభాగం సమాచారం. 150 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



చీఫ్ సెక్రటరీకి వరద ముంపు నదుల స్థితిగతుల్ని వివరిస్తున్న అభివృద్ధి కమిషనర్




సువర్ణ రేఖ కుడి కాలువ పటిష్టత పర్యవేక్షిస్తున్న జల వనరుల విభాగం ఇంజినీర్ల బృందం

పొడి ఆహారం సరఫరా

బాధిత గ్రామాల ప్రజలకు పొడి, వండిన ఆహారం పంపిణీ చేస్తున్నారు. ఇతర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్‌లలో ఒడ్రాఫ్ బృందాలను మోహరించారు. సహాయక చర్యలకు మద్దతుగా కటక్ నుంచి 2 యూనిట్ల అదనపు బృందాలను బాలాసోర్‌కు పంపుతున్నారు. అగ్నిమాపక దళం అధునాతన పరికరాలతో రక్షణ, సహాయక చర్యలలో చురుకుగా పాల్గొంటోంది.

• ప్లేట్లు ఊడుతున్నాయ్!



ప్లేట్లు కలిపే నట్లు, బోల్టులు ఊడిపోతున్న దృశ్యం



కుమిలి కమతా మార్గంలో ఇనుప వంతెన

కొరాపుట్: ఇనుప వంతెన ప్లేట్లు ఊడుతున్నా అధికారులు పట్టించు కోవడంలేదు. కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి కుమలి కమత రోడ్డు మార్గంలో హోర్దలి వద్ద నదిపై ఇనుప వంతెన ఉంది. దానిపై వెళ్తున్న వాహనాల వలన ప్లేట్లుకి ఉన్న నట్లు, బోల్టులు ఊడిపోతున్నాయి. ఇలా ఒక్కొక్కటి ఊడుతుండడ తో ఇనుప ప్లేట్లు వదులుగా మారాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తే ప్లేట్లు నదిలో పడి పోవడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షాకాలం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటున్నారు. అధికారులు స్పందించి ప్లేట్లు ఊడిపడిపోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడి దర్శనం



రాయగడ: కూర్మావతారంలో స్వామివారు



బిసంకటక్‌లో సొదర,సొదరీమణులతో కూర్మావతారంలో జగన్నాథుడు




అన్నభోగం కోసం పడిగాపులు కాస్తున్న భక్తులు

రాయగడ: స్థానిక గుండిచా మందిరంలో కొలువు దీరి పూజలందుకుంటున్న జగన్నాథుడు సోమవారం కూర్మావతారంలొ భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి వారి దర్శనభాగ్యం కోసం భక్తులు బారులు తీరుతున్నారు. జిల్లాలోని బిసంకటక్‌లో కూడా జగన్నాథ రథాయాత్ర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గుండిచా మందిరంలో స్వామి వారు చెల్లెళ్ల శుభద్ర, సొదరుడు అగ్రజుడు బలభద్రుని సమీతంగా కూర్మావతారంలో దర్శనం ఇచ్చారు. అలాగే స్వామివారి అన్నప్రసాదం కోసం భక్తులు బారులు తీరుతున్నారు. స్థానిక గుండిచా మందిరంలో అన్నభోగం కోసం 60 రూపాయల టిక్కెట్టు ధరను నిర్ణయించిన నిర్వాహకులు ఆవిధంగా అన్నభోగాలను విక్రయిస్తున్నారు. అయితే గంటల తరబడి భోగం కోసం పడికాపులు పడాల్సి వస్తుందని భక్తులు నిరాశ చెందుతున్నారు. పరిమితంగా టిక్కెట్లు విక్రయిస్తుండటంతో అందరికీ భోగం అందుబాటులో ఉండటం లేదు.

పూరీ తొక్కిసలాటపై హక్కుల కమిషన్ తాఖీదు జారీ

భువనేశ్వర్: పూరీ రథ యాత్రలో చోటు చేసుకున్న తొక్కిసలాట సంఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తాఖీదులు జారీ చేసింది. పూరీ జిల్లా కలెక్టర్ పోలీసు సూపరింటెండెంట్ వివరణ కోరుతూ ఈ తాఖీదులు జారీ అయ్యాయి. ఈ విచారకర సంఘటనలో గాయపడిన వారికి సరైన చికిత్స అందించాలని ఆదేశించింది. మిగిలిన రథయాత్రను సరైన పద్ధతిలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించింది.

నందన్ కానన్‌లో పసుపు అనకొండల జననం



నందన్ కానన్‌లో జన్మించిన పుసుపు అనకొండ పిల్లలు

భువనేశ్వర్: నగరం శివార్లు బారంగ్ నందన్ కానన్‌లో 7 అనకొండ పాము పిల్లలు జన్మించాయి. 2019 సంవత్సరంలో చెన్నైలోని మద్రాస్ క్రోకోడైల్ బ్యాంక్ ట్రస్ట్ నుండి తీసుకు వచ్చిన ఒక జత అనకొండలు రెండో సారి ఈ పిల్లల్ని జన్మనిచ్చాయి. వీటితో జంతు ప్రదర్శనలో అనకొండల సంఖ్య 14కి చేరింది.



తల్లి అనకొండ

ఘనంగా దేశాలమ్మతల్లి వార్షికోత్సవం



నెక్కంటికి, మాజీ మంత్రి హిమిరికకు స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు



అమ్మవారి ఘటాల వద్ద పూజలు చేస్తున్న నెక్కంటి

రాయగడ: సదరు సమితి పరిధి జేకేపూర్‌లోని బీసీ రోడ్డు వద్ద పూజలందుకుంటున్న దేశాలమ్మతల్లి అమ్మవారి వార్షిక జాతర ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యింది. మూడు రోజులు జరగనున్న యాత్రను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. అమ్మవారి ఘటాలు కొలువుదీరాయి. రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు, మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరికలు సోమవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నెక్కంటికి ఉత్సవ కమిటీ సభ్యులు జె.రాజు, ఆర్.శంకరరావు, జి.శంకరరావు, పుండరీకాక్ష సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు. మందిర అభివృద్ధిని చేసి అమ్మవారి జాతరను ఏటా ఘనంగా నిర్వహించి అమ్మవారి కరుణా కటాక్షాలు పొందాలని ఈ సందర్భంగా నెక్కంటి ఆకాంక్షించారు.

పెరిగిన వర్షపాతం

భువనేశ్వర్: రాష్ట్రంలో వర్షపాతం గణనీయంగా పెరిగింది. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు నమోదైన రుతుపవనాల ప్రభావంతో కురిసిన సగటు వర్షపాతం సాధారణం కంటే అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ సమాచారం. ఈ వ్యవధిలో సాధారణ వర్షపాతం 209.3 మిల్లీ మీటర్లు కాగా వాస్తవ వర్షపాతం 245.2 మిల్లీ మీటర్లు నమోదైంది. జూన్‌లో 3 జిల్లాలలో అత్యధిక వర్షపాతం, 9 జిల్లాల్లో అధిక వర్షపాతం, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన 3 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మయూర్‌భంజ్, జగత్‌సింగ్‌పూర్, బౌద్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. నుఆపడా, గజపతి, ఝార్సుగుడ జిల్లాల్లో లోటు వర్షపాతం కొనసాగుతుంది. గత 24 గంటల్లో పలు ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.

జిల్లా	ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
మయూర్‌భంజ్	జమ్దా	132.0
మయూర్‌భంజ్	సారొసాకొణ	110.0
సుందర్‌గడ్	టెన్సా	98.4
మయూర్‌భంజ్	కరంజియా	82.0
మయూర్‌భంజ్	కుసుమి	79.0
మయూర్‌భంజ్	బహల్దా	72.0
కలహండి	రామపూర్	72.0
కెంజొహర్	జోడా	71.3
సుందర్‌గడ్	బలిశంకర్	70.0
కొరాపుట్	కోట్పాడ్	67.0
సుందర్‌గడ్	బారాగాంవ్	66.4
మయూర్‌భంజ్	రాయిరంగపూర్	65.6
మయూర్‌భంజ్	బిజతొలా	65.0

శ్రీ గుండిచాకు భక్తుల తాకిడి



ఉక్కిరి బిక్కిరి నివారణకు వరుసలో వెళ్తున్న భక్తులపై చన్నీటి సించనం



అడపా ఖిచుడి ప్రసాదం



అడపా మండపంపై శ్రీ జగన్నాథుని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



అడపా ఒభొడా

భువనేశ్వర్: శ్రీ గుండిచా మందిరం భక్తుల తాకిడితో కిటకిటలాడుతోంది. అడపా మండపంపై మూల విరాటుల్ని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. శ్రీ మందిరం తరహాలో ఇక్కడ అన్ని సేవలు యథాతథంగా కొనసాగుతాయి. భక్తులకు మహా ప్రసాదం (అన్న భోగం) లభిస్తుంది. సోమవారం నుంచి ఈ ప్రసాదం లభ్యం అవుతుంది. అడపా మండపంపై దర్శనం తర్వాత అడపా ఒబొఢా (అన్న భోగం) ఆరగించడం కూడ పుణ్యప్రదమని భక్తుల విశ్వాసం.

శ్రీ మహాలక్ష్మి ఆగమనం

మంగళ వారం పవిత్ర హిరా పంచమి. అన్నా చెల్లెళ్లతో శ్రీ జగన్నాథుడు శ్రీ గుండిచా యాత్రకు తరలి వచ్చాడు. శ్రీ మందిరం బోసిబోయింది. శ్రీ మహాలక్ష్మి ఒంటరైంది. స్వామిని దర్శించుకునేందుకు విచ్చేస్తున్న సందర్భంగా శ్రీ గుండిచా యాత్రలో హిరా పంచమి ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీ మహాలక్ష్మి ఆగమనం పురస్కరించుకుని శ్రీ జగన్నాథుడు మరోమారు ముస్తాబయ్యేందుకు సిద్ధమయ్యాడు. పంచమి యుక్త చతుర్థి తిథి సందర్భంగా శ్రీ గుండిచా అడపా మండపంపై శ్రీ జగన్నాథునికి శ్రీ ముఖ సింగారం (బొనొకొ లగ్గి) చేశారు. తిథి ఘడియలకు అనుగుణంగా సోమవారం రాత్రి ద్వితీయ భోగ మండప సేవ అనంతరం ఈ సేవ నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ లెక్కన రాత్రి 9 గంటలకు ఆరంభించారు. సుమారు 4 గంటల సేపు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేశారు. కస్తూరి, కేసరి, కర్పూరం వంటి ప్రముఖ సుగంధ ద్రవ్యాలతో అలంకరించుకుని శ్రీ జగన్నాథుని ముఖం ముఖం ప్రకాశవంతం అవుతుంది.

వరుస క్రమంలో దర్శనం

శ్రీ జగన్నాథుని జనన వేదికగా పేరొందిన శ్రీ గుండిచా మందిరం అడపా మండపంపై స్వామి దర్శనం విశేషత కలిగి ఉంది. రద్దీ క్రమంగా పెరుగుతుంది. భక్తులకు క్రమబద్ధమైన దర్శనానికి ఏర్పాట్లు చేశారు. తొక్కిసలాట వంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక బారికేడ్ గుండా వరుస క్రమంలో భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. సోమవారం ఉదయం బొడొ సింగారం అలంకరణ తర్వాత తలుపులు తెరవడంతో సర్వ దర్శనానికి అనుమతించారు. ఉదయం 6 గంటల నుంచి ప్రతిపాదించిన సర్వ దర్శనం ఉదయం 10.10 గంటలకు ఆరంభం కావడంపై సర్వత్రా విచారం వ్యక్తం అయింది. భక్తులు బారికేడ్ గుండా శ్రీ గుండిచా సింహ ద్వారం నుంచి ప్రవేశించి నక్కొచొణా ద్వారం గుండా వెలుపలకు వచ్చేందుకు వీలుగా వరుస వ్యవస్థ ఏర్పాటు చేశారు. మంగళవారం హిరా పంచమి నాడు, శ్రీ మహా లక్ష్మీ దేవి శ్రీ గుండిచా ఆలయాన్ని సందర్శించనుంది.

క్లుప్తంగా

రాయగడలో విజృంభిస్తున్న అతిసారం



అతిసారంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

రాయగడ: జిల్లాలో అతిసారం వ్యాధి చాపకింద నీరులా విజృంభిస్తోంది. కొలనార సమితి సూరి, కూలి, పెంట, రాయగడ సమీపంలో గల పితామహల్ తదితర ప్రాంతాల్లో ఈ వ్యాధి బారిన పడిన రోగులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రతి రోజూ 8 మంది వరకు అతిసారం వ్యాధితో వార్డుల్లో చేరుతున్నట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అందాక ఇంటికి వెళ్లిపోతున్నారని జిల్లా అదనపు ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమార్ మిశ్రో తెలిపారు. తాగునీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నట్లు వివరించారు.

140 మందికి ఉచిత వైద్య పరీక్షలు



చికిత్స పొందుతున్న రోగులు

జయపురం: దక్షిణ ఆయుర్వేద వికాస పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఏక్టివ్ లైఫ్ ఫిజియోథెరిఫీ కేంద్రంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్వర్గీయ మీన కేతన పండ స్మృతి కమిటీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో డాక్టర్లు సుదర్శణ గౌడ, బినోద్ బిహారి రథ్, ప్రశాంత్ కుమార్ ప్రధాన్, మనోజ్ కుమార్ ప్రధాన్ రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. రోగులకు అవసమైన ఆయుర్వేద మందులు ఉచితంగా ఇచ్చి వాటిని వాడే విధానాన్ని వివరించారు. శిబిరంలో 140 మంది రోగులకు వైద్యపరీక్షలు జరిపినట్లు నిర్వాహకులు వెల్లడించారు. కవిరాజ్ క్షేత్రవాసీ పండ, భవానీచరణ ఆచార్య, సత్యనారాయణ పరిచ, శ్రీనివాస పాత్రో, కాశీచరణ మహరాణ, రాజేంద్ర జెన, రంజన్ కుమార్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస పాత్రో సహకరించారు. ఆయుర్వేద వైద్యులు పమేశ్వర పాత్రో ధన్యవాదాలు తెలియజేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు తీవ్ర అస్వస్థత

● మెడికల్ కళాశాలలో చేరిక



సస్మితా మెలకను పరామర్శిస్తున్న రఘురాం పాడాల్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజీలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న కొరాపుట్ మాజీ ఎమ్మెల్యే రఘురాం పాడల్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం రఘురాం మీడియాతో మాట్లాడుతూ.. సస్మితా మెలకపొట్టలో కణితి వంటి రాయి ఏర్పడిందన్నారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి తొలగించారని ప్రకటించారు. ప్రస్తుతం ఆమె కోలుకున్నారని రఘురాం పేర్కొన్నారు.

జనం చెంతకు జగన్నాథుడు



పర్లాకిమిడి: నృసింహ, వరాహ అవతారంలో జగన్నాథుడు, బలభద్రలు



జయపురం: మత్స్య, కశ్యప అవతారాల్లో దర్శనమిచ్చిన దేవతామూర్తులు

పర్లాకిమిడి: స్థానిక గుండిచా మందిరంలో సోమవారం నృసింహా, వరాహ అవతారంలో జగన్నాథ, బలరాముడు భక్తులకు దర్శనం ఇచ్చారు. గుండిచా వెలుపల భక్తులు స్వామి వారి ఓబడా ప్రసాదాన్ని స్వీకరించేందుకు బారులు తీరారు. మంగళవారం గుండిచా మందిరంలో హిరా పంచమి వేడుక జరుగనుంది.

భక్తులకు దర్శనం..

జయపురం: జయపురం గుండిచా మందిరంలో ఆదివారం రాత్రి జగన్నాథుడు, బలభద్ర దేవతా మూర్తులు మత్స్య, కశ్యప అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. అవతార మూర్తులను తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. జయపురంలో ఒక రోజు ఆలస్యంగా రథయాత్ర ప్రాంభం కావటం వలన రెండు అవతారాల్లో దేవతా మూర్తులు ఒకే రోజు భక్తులకు దర్శనమిచ్చారు.

బీఎంసీ కమిషనర్‌పై దాడి

భువనేశ్వర్:



అదనపు కమిషనరుపై అపరిచితుల అమానుష దాడి

స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) కార్యాలయంలో అదనపు కమిషనర్‌పై అమానుష దాడి దిగ్భ్రాంతిని కలిగించింది. సోమవారం కార్యాలయంలో ప్రజాభియోగాల విచారణ కొనసాగుతున్న తరుణంలో స్థానిక 6వ నంబరు వార్డు కార్పొరేటరు, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఆధ్వర్యంలో అపరిచిత వ్యక్తులు విధి నిర్వహణలో ఉన్న అదనపు కమిషనర్ రత్నాకర్ సాహుపై అకస్మాత్తుగా దాడికి దిగారు. అపరిచిత వ్యక్తులతో కలిసి వార్డు కార్పొరేటరు ప్రజాభియోగాల విచారణ నిర్వహిస్తున్న అధికారిని ఈడ్చుకుంటూపోయి కాలితో తన్ని ఘోరంగా అవమానపరిచారు. ఈ సంఘటనపై సర్వత్రా విచారం వ్యక్తం అవుతుంది. నగర పాలక సంస్థ కార్యాలయంలోనికి అపరిచిత వ్యక్తులతో చొరబడి కార్పొరేటరు వ్యూహాత్మకంగా అధికారిని అవమానపరిచే రీతిలో ప్రాణాంతక దాడికి పాల్పడ్డాడు. ఈ చర్యపై నిరసనతో బీఎంసీ సిబ్బంది, కార్పొరేటర్లు ధర్నా నిర్వహించారు. నిందితుల వ్యతిరేకంగా చర్యలు చేపట్టేంత వరకు నిరసన నిరవధికంగా కొనసాగుతుందని హెచ్చరించారు. బీఎంసీ కార్యాలయం ఎదురుగా నడి రోడ్డు మీద బైఠాయించి ఆందోళన చేపట్టడంతో ప్రధాన మార్గంలో వాహన రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అదుపు చేసేందుకు ఆందోళనకారుల్ని చెదరగొట్టారు. ఈ నేపథ్యంలో మేయరు, పలువురు బీజేడీ ఎమ్మెల్యేలు, ముందంజ కార్యకర్తల్ని పోలీసులు వ్యానులో తరలించారు.

నిందితులు అరెస్టు

విధి నిర్వహణలో ఉన్న నగర పాలక సంస్థ అదనపు కమిషనరుపై దాడికి పాల్పడిన ఆరోపణ కింద 3 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. వీరిలో 6వ నంబరు వార్డు కార్పొరేటరు ఉన్నాడు. అరెస్టు చేసిన వారిలో జీవన్ రౌత్, రస్మి మహాపాత్రొ మరియు దేబాశిష్ ప్రధాన్ ఉన్నట్లు స్థానిక ఖారవేళ నగర్ ఠాణా పోలీసులు తెలిపారు.

వాటర్‌షెడ్ జాయింట్ డైరెక్టర్‌పై విజిలెన్స్ దాడి

కొరాపుట్: వాటర్ షెడ్ జాయింట్ డైరెక్టర్ దయానిధి బాగ్ ఆస్తుల లక్ష్యంగా విజిలెన్స్ విభాగం దాడులు నిర్వహించింది. సోమవారం ఉదయం 6 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా 8 చోట్ల ఏక కాలంగా ఈ దాడులు ప్రారంభమయ్యాయి. వాటర్ షెడ్ విభాగంలో రాయగడ జిల్లాలో, రాష్ట్ర సోషల్ కన్జర్వేషన్ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేశారు. విధి నిర్వహణలో అనేక అక్రమాస్తులు కూడబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. కలహండి జిల్లా భవాని పట్న విజిలెన్స్ కోర్టు ప్రత్యేక జడ్జి ఈ దాడులకు సెర్చ్ వారెంట్లు జారీ చేశారు. నిందితుని స్వస్థలం కలహండి జిల్లా జునాగడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుప్పుగాంలో, ఇదే జిల్లా ధర్మగఢ్ లో విక్రం గుడలోని అల్లుడు నివాసంలో, భువనేశ్వర్‌లోని గోతపట్న లోని మహానది అపార్ట్‌మెంట్‌లో, భువనేశ్వర్‌లోని చంద్ర శేఖర్ పూర్‌లోని సొంత ఇంటిలో, భువనేశ్వర్‌లోని వాటర్‌షెడ్ కార్యాలయ చాంబర్‌లో, నబరంగ్‌పూర్ జిల్లా మజ్జిగుడలో నిర్మితం అవుతున్న భవనంలో, నబరంగ్‌పూర్ జిల్లా చుటియా గుడలో భార్య పేరు మీద ఉన్న 2 భవనాల్లో దాడులు ప్రారంభమయ్యాయి. ఈ దాడుల్లో 10 మంది డీఎస్పీలు, 8 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.



దయానిధి బాగ్



దాడుల్లో బయటపడిన నగలు



భువనేశ్వర్‌లో దయానిధి నివాసం

రైలు ప్రయాణం చార్జీలు పెంపు

భువనేశ్వర్: భారతీయ రైల్వే శాఖ ప్రయాణం చార్జీలు పెంచింది. జూలై ఒకటో తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చార్జీలు అమలవుతాయని స్పష్టం చేసింది. ద్రవ్య సేవా పన్ను (జీఎస్‌టీ), రిజర్వేషన్, సూపర్‌ఫాస్ట్ సర్‌చార్జీలు వంటి అనుబంధ చార్జీల్లో మార్పు లేదని రైల్వే శాఖ తెలిపింది. చార్జీల తాజా పెంపు ఉత్తర్వుల ప్రకారం సబర్బన్ సింగిల్ జర్నీ చార్జీలు, సీజన్ టిక్కెట్ల (సబర్బన్, నాన్-సబర్బన్ మార్గాలకు) చార్జీల్లో మార్పు లేదు. సాధారణ తరగతిలో 500 కిలో మీటర్ల వరకు ప్రయాణ చార్జీలో ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగుతుంది. 501 నుంచి 1500 కిలో మీటర్ల వరకు ప్రయాణానికి రూ. 5, 2,500 కిలో మీటర్ల వరకు రూ. 10, 2,501 నుండి 3,000 కిలోమీటర్ల ప్రయాణం చార్జీని రూ.15 పెంచారు.

హర్యానారాష్ట్ర మహిళపై లైంగిక దాడి

జయపురం: పొట్టకూటి కోసం.. కష్టపడి జీవించేందుకు హర్యాన రాష్ట్రం నుంచి జయపురం వచ్చిన ఒక మహిళపై దుండగుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధిత మహిళ జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. తనపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి పట్టణంలో ఒక వ్యాపారి అని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మహిళా పోలీసు అధికారి అంకిత ఖాల్కో వెల్లడించారు. పోలీసుల వివరణ ప్రకారం.. ఈ ఘటన జూన్ 28వ తేదీ రాత్రి జరిగింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కాశ్యప్ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన..

● 16 గ్రామాలకు రాకపోకలు బంద్



కొలాబ్ రిజర్వాయర్‌లో కూలిపోయిన వంతెన

కొరాపుట్: భారీ వర్షాలకు తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో 16 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లమ్తాపుట్ సమితి ఉమ్మెల్ గ్రామ పంచాయతీకి సిమిలిగుడ సమితి రాజుపట్ గ్రామ పంచాయతీలను కలిపే వంతెన సోమవారం కొట్టుకుపోయింది. ఈ రెండు పంచాయతీలలో చెరో ఎనిమిదేసి గ్రామాలు కలసి కొలాబ్ రిజర్వాయర్‌లో వెదురు వంతెన నిర్మించుకొని రాక పోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ వంతెన కూలిపోవడంతో సిమిలిగుడ సమితి కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 60 కిలో మీటర్లు ప్రయాణం చేయాలి. ఇక్కడ వంతెన కోసం దశాబ్దాలుగా ప్రజలు విజ్ఞప్తులు చేస్తున్నా వంతెన నిర్మాణం జరగలేదు. దీంతో గిరిజనులే వెదురు వంతెన నిర్మించుకుంటే అదీ కూలిపోయింది.

పట్టణ సమస్యలపై అధికారులకు వినతి



సమావేశంలో సిటిజన్ కమిటీ ప్రతినిధులు

జయపురం: జయపురం ప్రజల సమస్యలతో పాటు ఇతర సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ఉద్యమించాలని జయపురం సిటిజన్ కమిటీ తీర్మానించింది. స్థానిక సిటిజన్ కమిటీ భవనంలో సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో పట్టణ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించింది. పట్టణంలో గల డ్రైనేజ్ సిస్టమ్‌ను స్వరేజ్ డ్రైన్ సిస్టంలో మమేకం చేయాలని, పోస్టల్ కార్యాలయాన్ని పునః ప్రారంభించాలని, పట్టణంలో రైల్వే టిక్కట్లు అమ్మే కౌంటర్ ఏర్పాటు, సర్దార్ పటేల్ మార్గంలో (మైన్ రోడ్డు)లోమహిళల కోసం ఆధునిక శైచాలయం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజనులకు గురింపు కార్డులు సమకూర్చాలని, పట్టణంలో భూమి రికార్డు కార్యాలయం ఏర్పాటు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మున్సిపాలిటీ వారిచే జనన, మరణ ధ్రువ పత్రాలు సమకూర్చే ఏర్పాటు చేయాలని, పట్టణ రెండవ మార్కెట్ పూర్తి స్థాయిలో నిర్వహించాలని, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని, ఆల్ట్రా సౌండ్ సౌకర్యం అందరు రోగులకు కల్పించాలని లిఖిత పూర్వకంగా డిమాండ్ చేయాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో సిటిజన్ కమిటీ అధ్యక్షులు బినోదిణీ శాంతపాత్ర, కార్యదర్శి జి.వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు మదన మోహననాయిక్, సలహాదారు సత్య భాను పండ, కార్యవర్గ సభ్యులు భీమ సేన్ అగర్వాల్, దేవేంద్ర బాహిణీపతి, పి.మహేశ్వరరావు, పరమేశ్వర పాత్రో, రత్నాకర చౌదురి, జి.బి. రావు, భవానీ ఆచార్య, గీతా ప్రకాశ మిత్ర, నరసిం చౌదురి పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

భువనేశ్వర్: కటక్ రైల్వే యార్డులో సరుకు రవాణా రైలు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో 3 ఖాళీ వ్యాగన్లు దెబ్బ తిన్నాయి. 8వ నంబరు రూటులో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తూర్పు కోస్తా రైల్వే అధికారులు తెలిపారు. ఆస్తి నష్టం సంభవించింది.



పట్టాలపై అడ్డగా పల్టీ కొట్టిన వ్యాగను



ప్రమాద తీవ్రతతో ఊడిన చక్రాలు

విద్యుత్ వినియోగంపై అవగాహన అవసరం

● ఘనంగా జాతీయ విద్యుత్ భద్రతా దినోత్సవం

పర్లాకిమిడి: విద్యుత్ వినియోగంపై లబ్ధిదారులు అవగాహన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. ఉరుములు, మెరుపులు, తుపాను సమయంలో, పిడుగులు పడినప్పుడు టీవీ, ఏసీ, వాషింగ్ మెషీన్, కంప్యూటర్ల స్విచ్ బోర్డుల నుంచి వేరు చేయాలని టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ సూపరింటెండింగ్ ఇంజినీరు దేవాషిష్ ప్రధాన్ అన్నారు. స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ జాతీయ విద్యుత్ భద్రతా దినోత్సవాన్ని దేవాషిష్ ప్రధాన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మోనాలిసా దాస్, ఉపాధ్యాయులు డి.శ్రీ రాంమూర్తి, శక్తి క్లబ్ అధ్యక్షురాలు పద్మినీ కుమార్ పండా, జగన్నాథ పట్నాయక్ మాట్లాడారు. విద్యుత్ తీగలు నేలకు తాకకుండా ఉండేలా చూసుకోవాలని, ఒక సాకెట్‌కు ఒకటి కంటే ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు జత చేయరాదని, తడిచేతులతో విద్యుత్ తీగలు ముట్టుకోరాదని ఎస్‌ఈ దేవాషిష్ ప్రధాన్ సూచనలిచ్చారు. అనంతరం విద్యుత్ భద్రతా వారోత్సవాలపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న హెచ్‌ఎం జగన్నాథ పట్నాయక్

పంచాయతీ కార్యాలయానికి తాళాలు

కొరాపుట్: సెల్ ఫోన్ నెట్‌వర్క్ సమస్యతో విసిగిపోయిన గిరిజనులు పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలియజేశారు. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి కుడి పంచాయతీ ప్రజలకు సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య వెంటాడుతోంది. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి తమకు తెలియకుండా పోయిందంటు ప్రజలందరూ సోమవారం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి నినసన తెలియజేసి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సమయంలో కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీ రాణి, వార్డు సభ్యులు ఉన్నారు. సిగ్నల్ సమస్యను తాము ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గిరిజనులతో చర్చలు జరిపారు.



కార్యాలయం గేటుకు తాళం వేసి ఆందోళన చేస్తున్న గిరిజనులు

60 కిలోల గంజాయి పట్టివేత

● ఇద్దరు అరెస్టు

మల్కన్‌గిరి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు పోలీసులకు చిక్కారు. వీరివద్ద నుంచి సుమారు 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి బలిమెల పోలీసుస్టేషన్ పరిధిలో పూజారిగూఢ గ్రామ సమీపంలో బలిమెల పోలీసులు ఆదివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. చిత్రకొండలో గంజాయిని కొనుగోలు చేసిన వ్యక్తులు రెండు బైక్‌ల్లో రెండు బ్యాగ్‌ల్లో ఉంచి అక్రమంగా జయపురం తరలిస్తున్నారు. బలిమెల పోలీసులకు అందిన సమాచారంతో ఐఐసీ దీరాజ్ పట్నాయక్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనాలపై వస్తున్న వారిని తనిఖీ చేయగా.. బ్యాగ్‌లో ఉన్న 60 కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో ఇద్దరిని వెంటనే అరెస్టు చేశారు. పట్టుబడిన యువకులను కోరుకొండ సమితి ముదిలిగూఢ గ్రామానికి చెందిన తార గోలారీ, నాథ్ హంతాల్‌గా గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. సుమారు మూడు లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు అధికారులు వెల్లడించారు.



పట్టుబడిన గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వభీమాన్ ఏరియా జాంత్రీ పంచాయతీలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా ఆస్పత్రి మెడిషన్ స్పెషలిస్ట్ కృష్ణచంద్ర మహాపాత్రో నేతృత్వంలో 15 మంది వైద్యశాఖ సిబ్బంది 200 మందికి వైద్య సేవలు అందించారు. 15 మందికి మలేరియా పాజిటీవ్ వచ్చింది. మరికొంత మందికి సాధారణ జ్వరం, వృద్ధులుకు ఈసీజీ తీసి మందులు అందించారు. బీపీ ఉన్నవారికి మందులు ఇచ్చారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు చేశారు.

ఇదే తొలిసారి..

చిత్రకొండ సమితిలో దూర్గాం ప్రాంతం ఒకప్పుడు మావోలు అడ్డాగా ఉండేది. జాంత్రీ పంచాయతీకి మావోల భయంతో అప్పటి ప్రభుత్వం రహదారి కూడా నిర్మించలేదు. ఈ పంచాయతీకి వెళ్లాలంటే లాంచీలే శరణ్యం. 4 గంటల పాటు చిత్రకొండ ఫిల్ బాయి నుంచి లాంచీలో ప్రయాణం చేసి ఆ ప్రాంతంలో మలేరియా టెస్టులు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జాంత్రీ పంచాయతీలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి మందులు ఇవ్వడం ఇదే తొలిసారి. ఈ ప్రాంతంలో ఏవరికైనా జబ్బు చేస్తే జాన్ బాయి వెళ్లి అక్కడ ఆరోగ్య కేంద్రంలో ఇచ్చిన మందులు తప్ప.. గిరిజన ప్రజలకు బయట ప్రపంచం తెలియదు. మావద్దకు వచ్చి వైద్యులు మందులు ఇస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రి సీనియర్ వైద్యులు నారాయణ్ పాత్రో, దేవశిష్ పండా, ఐసీయూ సిబ్బంది పద్మావతి జేనా, నర్సింగ్ అధికారి రష్మరేఖా పరిడా, సంగీత నాయక్, దీపికా దాస్, ఐశ్వర్య స్వాయ్, ఆరోగ్య కార్యకర్తలు శంకర్ పాల్, మహిమా దాస్, బసంత్ రాయ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



మహిళకు టెస్టు చేస్తున్న వైద్యుడు కృష్ణచంద్ర మహాపాత్రో

వినతుల వెల్లువ



మల్కన్‌గిరి: కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న వృద్ధుడు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి బొమ్మిగ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాయింట్ గ్రీవెన్స్ సెల్ సోమవారం జరిగింది. ఈ గ్రీవెన్స్‌కు జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వాహణ అధికారి శంకర కెరకెటా, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, సబ్ కలెక్టర్ అనుప్ పండా హాజరయ్యారు. బొమ్మిక పంచాయతీలో మధుసూదన్‌పూర్, కంట్రగడ, మచ్చుమర గ్రామాల నుంచి మొత్తంగా 54 వినతులు అందాయి. వాటిలో వ్యక్తిగతం 15, గ్రామ సమస్యలకు సంబంధించినవి 39 అందాయి. వాటిని త్వరితగతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ నారాయణ బెహరా, గుసాని బీడీఓ గౌరచంద్ర పట్నాయక్, సీడీఎంఓ డాక్టర్ ఎం.ఎం.అలీ, డి.ఎస్.ఎస్.ఓ సంతోష్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

చిత్రకొండ సమితిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ నేతృత్వంలో గ్రీవెన్స్ నిర్వహించి 48 వినతులు స్వీకరించారు. చిత్రకొండ పరిసర పంచాయతీలకు చెందిన వారు వచ్చి తమ సమస్యలను వినతుల రూపంలో కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ వాటిని పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ చంద్ర సభోరో, చిత్రకొండ సమితి ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: గ్రీవెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దాస్, అధికారులు

కుంభేయిగుడలో ఏనుగుల సంచారం



ఏనుగుల గురించి గ్రామాల్లో పర్యటించి వివరిస్తున్న అటవీ శాఖ అధికారులు



ఏనుగుల అడుగుల గుర్తులను గుర్తించిన అధికారులు

రాయగడ: రాయగడ అటవీ రేంజ్ పరిధిలోని కుంభేయిగుడ ప్రాంతంలో మూడు గున్న ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో వాటి సంరక్షణకు సంబంధించి ఆయా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను విద్యుత్ శాఖ నిలిపివేసింది. విద్యుత్ ఘాతానికి గురైతే ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న ముందస్తు చర్యలతొ అధికారుల ఆదేశానుసారం ఆయా ప్రాంతంలో విద్యుత్ సరఫరాను గత రెండు రోజులుగా నిలిపివేశారు. అయితే సమీపంలో గల గ్రామంలో విద్యుత్ సరఫరా కొనసాగుతున్నప్పటికీ అటవీ ప్రాంతం వైపు గల విద్యుత్ తీగలకు సంబంధించి సరఫరాను నిలిపివేశారు. అటవీ రేంజ్ పరిధిలో గల పొంగిలి, సూరి, ఫకీరీ, కుంభేయిగుడ, తొటాగుడ, ఖమాసింగి అదేవిధంగా బొడొఖిల్లా పదర్ పంచాయతీలోని అరబి, ఖరగడి, నన గుమడ, బొడొగుమడ తదితర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఆది, సొమవారాల్లో ఆయా ప్రాంతాల్లొ పర్యటించిన అటవీ శాఖ అధికారులు ఏనుగుల నడక గుర్తులను గుర్తించారు. ఒక ఆడ ఏనుగు, ఒక మగ ఏనుగుతో పాటు మరో చిన్న ఏనుగు పిల్ల ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఏనుగుల సంచారానికి సంబంధించి గ్రామస్తులను చైతన్య పరిస్తున్న అధికారులు వాటి నుంచి తీసుకోవాల్సిన రక్షణ చర్యలు గురించి వివరించారు.

క్లుప్తంగా

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పట్టుకున్న బెల్లంఊటతో ఎస్సై అనీష్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాల్లో సోమవారం దాడులు చేసి 800 లీటర్ల బెల్లం ఊటను పట్టుకుని ధ్వంసం చేసినట్లు చినమేరంగి ఎస్సై అనీష్ తెలిపారు. గ్రామాల్లో సారా, మద్యం అమ్మినా తెలియజేయాలని, అటువంటి వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై ప్రజలకు సూచించారు.యువత చెడువ్యసనాలకు బానిసకావద్దని హితవు పలికారు. సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

230 సారా ప్యాకెట్లు సీజ్

సాలూరు రూరల్: మండలంలోని బాగువలస గ్రామం వద్ద ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 230 సారా ప్యాకెట్లు సోమవారం పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. నక్కడ వలస గ్రామానికి చెందిన సురగడ రామ్మోహన్ ను పట్టుకుని సారా ప్యాకెట్లతో పాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.40 వేలు ఫైన్‌రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తుల నుండి సోమవారం కోర్టులో రూ.40 వేలు ఫైన్ కట్టించినట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

చిన్నబగ్గ సమీపంలో ఏనుగులు



చిన్నబగ్గ ఆశ్రమపాఠశాల పక్కతోటలో ఉన్న ఏనుగుల గుంపు

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ ఆశ్రమపాఠశాలకు సమీపంలో నాలుగు ఏనుగుల గుంపు ఘీంకరిస్తోంది. సోమవారం రాత్రి ఏనుగులు ఇక్కడికి రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నిన్న, మొన్నటి వరకు చిన్న బగ్గ, గోరపాడు కొండల్లో సంచరించిన ఏనుగులు ఇప్పుడు ఏకంగా గ్రామానికి దగ్గరలోనే తిష్ట వేయడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి గ్రామస్తులు భయపడుతున్నారు. ఏనుగులను కవ్వించవద్దని అటువైపు ఎవ్వరూ తిరగవద్దని స్థానికులకు ట్రాకర్లు తెలియజేస్తున్నారు. ఎఫ్‌బీవో దాలినాయుడుతో పాటు సిబ్బంది ఏనుగుల గమనాన్ని పరిశీలిస్తున్నారు.

యువకుడిపై అట్రాసిటి కేసు నమోదు

గంట్యాడ: పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అవసరం తీరాక పెళ్లికి నిరాకరించిన యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం విజయనగరానికి చెందిన ఓ దళిత యువతి, నరవ గ్రామానికి చెందిన ఓయువకుడు ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ కలిసి తిరిగారు. కొద్ది రోజుల క్రితం పెళ్లి చేసుకోవాలని యువకుడిని యువతి కోరగా అందుకు నిరాకరించాడు. దీంతో యువతి గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

పార్వతీపురంటౌన్: మాదక ద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు మందులు కుటుంబాలను, ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. వాటిపై అవగాహన అత్యావశ్యమన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమని, దానిని కాపాడుకోవడం మన కర్తవ్యమని చెప్పారు. యోగా వంటి ఆరోగ్య అంశాల పట్ల ఆసక్తి కలిగి ప్రతిరోజూ సాధన చేయడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని హితవు పలికారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందులు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా ఆర్థికంగా, మానసికంగా కుటుంబాలను నాశనం చేస్తాయన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభమయ్యాయని వాటి చుట్టుపక్కల ఎటువంటి విక్రయాలు, కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉండాలని స్పష్టం చేశారు. అటవీ, మారుమూల ప్రాంతంలో సారా తయారీ వంటి అంశాలను గమనించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల విక్రయాలు వివిధ రూపాల్లో ఉండే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందుల ఉత్పాదకత, సరఫరా, రవాణా, విక్రయాలు, వినియోగం జరిగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాటికి సంబంధించిన వివరాలు తెలిసినవారు 1972 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. రవాణా వాహనాలను తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా రవాణా అధికారి వి.దుర్గాప్రసాద్ రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.సుమిత్ర, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశ షేక్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వీవీవీ ఎస్ఎస్‌బాబు, ఆర్పీఎఫ్ ఎస్సై ఎ.కె.పాణిగ్రహి, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సీట్లు ఇవ్వని.. ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్ఎస్‌కు 172 వినతులు



ప్రైవేట్ స్కూళ్లపై తనిఖీలు చేయాలని డీఈఓ మాణిక్యంనాయుడిని ఆదేశిస్తున్న కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలలు పేద విద్యార్థులకు ఉచిత సీట్లు ఇవ్వకపోతే ఆయా స్కూళ్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీల్లో ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లలో చేర్చుకోవడం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వినతులు అందజేశారు. వరుసగా రెండు మూడు వారాల పాటు ఇలాంటి వినతులే రావడంతో సంబంధిత ప్రైవేట్ పాఠశాలలపై కలెక్టర్ ఆగ్రహించారు. కేటాయించిన సీట్లలో ఉచిత ప్రవేశాలను ఇవ్వని పట్టణంలోని బీసెంట్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సన్ స్కూల్‌పై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని ఆర్‌డీవో సవరమ్మ, డీఈఓ యూ.మాణిక్యం నాయుడిని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని, లాగిన్‌లో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, అలాగే రీఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌కు 172 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, విజయనగరం ఆర్‌డీఓ సవరమ్మ, డిప్యూటీ కలెక్టర్ మురళి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 172 వినతుల్లో అధికంగా 69 వరకు రెవెన్యూ శాఖకు చెందిన వినతులు అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

• పోలీస్ గ్రీవెన్స్ సెల్‌కు 34 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్:

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 34 ఫిర్యాదులు వచ్చాయి. ఈ వారం ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించి 12, కుటుంబ కలహాలకు సంబంధించి 3, మోసాలకు పాల్పడినట్లు 4, ఇతర అంశాలకు సంబంధించి 15 ఫిర్యాదులు ఉన్నాయని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో మాట్లాడుతూ ఫిర్యాదు అంశాలను పరిశీలించి అవసరమైతే విచారణ చేసి, ఫిర్యాదులు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్. రాజేష్ పీజీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఓ సేవలు అభినందనీయం



సీపీఓ వీరరాజు దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా ప్రణాళిక అధికారి వీరరాజు సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రణాళిక అధికారి వీరరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై వీరరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరరాజు మంచి సేవాతత్పరతతో వృత్తిని నిర్వహించారని ప్రశంసించారు. అంకిత భావంతో సేవలు అందించడం వల్ల మన్ననలు పొందగలరని పేర్కొన్నారు సీనియర్ల సేవలను జూనియర్లు గుర్తించి వారిని మార్గదర్శకంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. రిటైర్ అయిన సీపీఓ పి.వీరరాజు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వృత్తిలో సంతృప్తి పొందానని పేర్కొన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు సహకరించిన కలెక్టర్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- డీఈఐసీ వైద్యాధికారి ఆదిత్య శేషసాయి

విజయనగరం ఫోర్ట్:

విద్యార్థులకు విద్యాబోధనతోపాటు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డీఈఐసీ (జిల్లా సత్వర చికిత్స కేంద్రం) వైద్యులు డాక్టర్ ఉండవల్లి ఆదిత్య శేషసాయి సూచించారు. మహారాజపేట బాలసదన్‌లోని విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై దృష్టి సారించగలరన్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలపట్ల అశ్రద్ధ చూపొద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు బి.చక్రవర్తి, సోషల్ వర్కర్ వై.శ్రీనివాస్‌రావు, బాలసదన్ మేనేజర్ శోభారాణి పాల్గొన్నారు.

కూటమి పెద్దలకి పరమాన్నం, పేదలకి గంజి నీళ్ళు

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: కాంగ్రెస్, తెలుగుదేశం, నేటి కూటమి ప్రభుత్వాలు గత 20 ఏళ్లుగా కాగ్నిజెంట్, టీసీఎస్, జిందాల్ లాంటి కంపెనీలకు కారుచౌకగా భూములను కట్టబెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయం డీఎస్ఆర్ అమర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..కోనేటి రంగారావు భూకమిటీ సిఫార్సులను అనుసరించి నాటి నుంచి నేటి వరకు ఎక్కడా ఎకరా భూమి కూడా పేద రైతులకు, పేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులను, నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించడమే కానీ పేదలకు భూమి ఇవ్వడానికి చేతులు రాని ప్రభుత్వాలు కార్పొరేట్లకు మాత్రం వేలాది ఎకరాల భూమిని కారుచౌకగా కట్టబెడుతున్నాయని విమర్శించారు. విజయనగరం జిల్లాలోని ఎస్.కోట నియోజవర్గం బౌడార ప్రాంతంలో ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 1100 ఎకరాల్లో 900 ఎకరాలు ప్రభుత్వ భూమిని జిందాల్ కంపెనీకి ఇవ్వడానికి తలపెట్టి బాక్సైట్ శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలనే తలంపుతో ఆనాటి జిల్లా జాయింట్ కలెక్టర్ జగన్మోహన్ రావు నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ప్రస్తుత ఉన్న కలెక్టర్ ఇటీవల కాలంలో మీడియాలో ఏ ప్రభుత్వం భూ సేకరణ జరపలేదని మాట్లాడారు. భూ సేకరణ చేయకుంటే ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు జరిగిందో నేడున్న కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిందాల్ భూముల విషయంలో ఆందోళనకారులపై దాడులు, నిర్బంధాలు, అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియచేశారు. పేదలకు అందాల్సిన పరిహారంలో అవకతవకలు జరిగినట్లు అనేక ఆరోపణలు వచ్చాయని దీనిపై తగు న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, అలమండ ఆనందరావు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో బీటెక్ విద్యార్థిని మృతి



ప్రమాద స్థలంలో పడిపోయిన స్కూటీ



మృతిచెందిన నాగమణి

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దుర్మరణం చెందింది. అందాల లోకాన్ని చూడడానికి వెళ్తూ అనంత లోకాలకు పయనమైంది. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన కర్రి నాగమణి(20) తన స్నేహితుడైన విశాఖపట్నం జిల్లా ప్రహ్లాదపురానికి చెందిన దాసరి కార్తీక్ ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి అరకు అందాలను తిలకించేందుకు నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై బయల్దేరారు. దాసరి కార్తీక్‌కు చెందిన స్కూటీపై నాగమణి పయనిస్తోంది. కాగా మంగళపాలెం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం డిపోకు చెందిన సిటీ బస్సు స్టాపర్‌ను తప్పించ బోయి స్కూటీపైకి వెళ్లడంతో స్కూటీపై పయనిస్తున్న ఇద్దరూ రోడ్డు అంచున పడిపోయారు. కార్తీక్ కొద్దిగా దూరంగా పడడంతో సురక్షితంగా తప్పించుకున్నాడు. నాగమణి బస్సుపై పడిపోవడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నాగమణి విజయనగరంలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతోంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మన్మధరావు తెలిపారు.

వైద్యుడు దేవుడితో సమానం

- విపత్కకాలంలోనూ రోగులకు సేవలు
- నేడు వైద్యుల దినోత్సవం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: వైద్యో నారాయణ హరి అన్నారు పెద్దలు. రోగులు వైద్యుడిని భగవంతుడిలా అరాధిస్తారు. ఎందుకంటే ప్రాణాలు నిలబెట్టగలిగే శక్తి వైద్యుడికి మాత్రమే ఉంటుంది. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో నైనా వెరవకుండా ధైర్యంగా సేవలు అందించేది వైద్యులే. నాలుగేళ్ల క్రితం కోవిడ్ మహమ్మారి విలయతాండవం చేసినప్పటికీ వైద్యులు ఏమాత్రం భయపడకుండా వైద్యసేవలు అందించారు. వైద్యుల్లో సేవాదృక్పథంతో పనిచేసే వారు ఉన్నారు. ధనార్జనే ధ్యేయంగా పనిచేసే వారు కూడా ఉన్నారు. సమాజంలో కొత్త కొత్త వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వాటి నివారణ చర్యలు కనుగొని వైద్యులు సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో రోగులకు సేవలందించే సమయంలో కోవిడ్ బారిన పడి పలువురు వైద్యులు మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ మిగిలిన వైద్యులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా కోవిడ్ బాధితులకు సేవలు అందించారు.

జిల్లాలో 700 మంది వరకు వైద్యులు

జిల్లాలో 50 పీహెచ్‌సీలు, 7 సీహెచ్‌సీలు, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, 300 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో సుమారు 700మంది వరకు వైద్యులు పనిచేస్తున్నారు.

సేవాభావం ఉంటే వైద్య వృత్తి చేపట్టాలి



ఓపిక, సహనం ఉంటేనే వైద్య వృత్తిని చేపట్టాలి. సేవాదృక్పథంతో వైద్యసేవలు అందించాలి. సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి వైద్యులు కృషి చేయాలి. ఆధునాతన వైద్యసేవలను ఎప్పటి కప్పుడు తెలుసుకోవాలి. రోగులు వైద్యులను గౌరవించాలి.

డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

వైద్యులు గౌరవప్రదంగా మెలగాలి



సమాజంలో వైద్యులు గౌరవప్రదంగా మెలగాలి. వెద్యులను ప్రోత్సహిస్తే వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారు. వైద్యులపై ఒత్తిడి పెట్టకూడదు. ఒత్తిడి లేకుండా ఉంటే మెరుగైన వైద్యసేవలు అందించగలరు. వైద్యులు రోగులకు ప్రేమతో సేవలు అందించాలి.

డాక్టర్ పద్మశ్రీ రాణి, డీసీహెచ్‌ఎస్

వైద్యవృత్తి ఉన్నతమైనది



వైద్యవృత్తి ఉన్నతమైనది. ప్రజలు డాక్టర్‌ని గౌరవించాలి. వైద్యం కోసం వచ్చే వారితో ప్రేమగా, అప్యాయంగా మాట్లాడి వారి సమస్యను తెలుసుకుని అవసరమైన వైద్యాన్ని అందించాలి. వైద్యవృత్తిని చేపట్టినందుకు అదృష్టంగా భావించాలి. ప్రతి రోగిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలి

డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, సర్వజన ఆస్పత్రి

బెదిరింపు ప్రకటనలు సరికాదు

- జిందాల్ భూములను రైతులకు అప్పగించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: 2006లో జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం తీసుకున్న భూములను చట్టప్రకారం పరిశ్రమ పెట్టనందున రైతులకు తిరిగి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు బెదిరింపు ప్రకటనలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విజయనగరంలోని ఎల్బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతుల నుంచి భూములు తీసుకుని 17 సంవత్సరాలైనా నేటివరకు ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, స్థానిక ప్రజలకు ఉపాధి చూపలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి తీసుకున్న భూములను ఐదేళ్లలో పరిశ్రమ కట్టకపోతే తిరిగి రైతులకు అప్పజెప్పాలని చట్టంలో ఉన్న విషయం అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. 2006 భూ సేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఎందుకు అప్పటి జాయింట్ కలెక్టర్ నిర్వహించారని ప్రశ్నించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ సేకరణ చేస్తే ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు ఆ రోజు పరిశ్రమను వ్యతిరేకించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. పరిశ్రమ పెట్టకపోతే భూములు వెనక్కి ఇవ్వకుండా ఇప్పుడు ఎంఎస్‌ఎంఈ పార్కు పెడతామని, అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బెదిరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు ఈ భూములు అప్పగించాలన్న కుట్ర తప్ప మరొకటి కాదన్నారు. ఒక వేళ కొత్త పరిశ్రమ కోసం భూమి కావాలంటే పబ్లిక్ హియరింగ్ పెట్టి మళ్లీ భూ సేకరణ చేపట్టి రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం చెల్లించి తీసుకోవాలి తప్ప బెదిరించి తీసుకుంటామని అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టీవీ.రమణ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు కళా చేసింది ▸ శూన్యం

- బొత్స, కళా హయాంలో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..
- తూర్పుకాపుల సంక్షేమానికి ఏనాడైనా కృషి చేశారా..
- కనీసం శ్రీకాకుళం జిల్లానైనా అభివృద్ధి చేశారా..
- 'కళా' ఉనికి కోసం 'బొత్స' విమర్శలు చేయడం తగదు
- తూర్పుకాపులకు ఉమ్మడి ఏపీలో బీసీ-డి రిజర్వేషన్ తీసుకొచ్చింది 'బొత్స'
- 'బొత్స' హయాంలోనే తోటపల్లి, జేఎన్‌టీయూ, మెడికల్ కళాశాల, ఎయిర్‌పోర్ట్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు
- వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి:

రాజకీయంలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతూ అనేక మంత్రి పదవులు నిర్వహించిన ప్రస్తుత చీపురుపల్లి టీడీపీ ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఉత్తరాంధ్ర జిల్లాల అభ్యున్నతికి ఏం చేశారో చెప్పగలరా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ(పీఏసీ) సభ్యుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యధికంగా ఉన్న తూర్పుకాపుల సంక్షేమానికి ఏం చేశారో చెప్పాలన్నారు. చీపురుపల్లిలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాను ఎంతో అభివృద్ధి చేసిన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉత్తరాంధ్ర ద్రోహి అంటూ కిమిడి కళా వెంకటరావు వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. మంత్రి పదవిపై ఆశతో తన ఉనికి చాటుకునేందుకు మాత్రమే ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్టు అర్థమవుతోందన్నారు. తమ నాయకుడు బొత్స సత్యనారాయణ, కళా వెంకటరావు హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఇరువురి హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజావేదిక ద్వారా ప్రజలకు తెలియజేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ పాల్గొన్నారు.

రిజర్వేషన్ ఘనత బొత్సతే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తూర్పుకాపులకు ఉత్తరాంధ్రలో మాత్రమే బిసి'డి' రిజర్వేషన్ ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు మంజూరు చేసేవారని, మిగిలిన జిల్లాల్లో ఓసీ కేటగిరిలోనే ఉండే వారని, దీంతో పేద వర్గాలకు చెందిన తూర్పు కాపులు ఎన్నో అవస్థలు పడ్డారన్నారు. అంతకు మునుపే కళా వెంకటరావు ఎన్నో మంత్రి పదవులు చేపట్టినా ఏ నాడూ రిజర్వేషన్ల అంశం పట్టించుకోలేదన్నారు. సమస్యను గుర్తించిన బొత్స సత్యనారాయణ దివంగత మహానేత వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తూర్పుకాపులు ఎక్కడున్నా బీసీ'డి' రిజర్వేషన్ ధ్రువీకరణ పత్రం జారీచేసేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు.

శ్రీకాకుళం జిల్లా ప్రజల ఆదరణతో ఎన్నోసార్లు మంత్రి పదవులు పొందిన కళా వెంకటరావు ఆ జిల్లాకు ఏం చేశారో చెప్పగలరా, కనీసం ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఏదైనా చేసినట్టు చెప్పగలరా అంటూ బెల్లాన ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానంలో కిడ్నీ వ్యాధి బాధితుల కోసం రూ.200 కోట్లతో తాగునీటి పథకం, రూ.200 కోట్లతో ఆస్పత్రి సదుపాయాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని గుర్తుచేశారు. ఆ జిల్లాలో ఆదరణ తగ్గిపోవడంతో సీటు కేటాయించక పక్క జిల్లా రావాల్సి వచ్చిన కళా.. ఏడాదిలో చీపురుపల్లికి చేసిన అభివృద్ధిని చూపించాలన్నారు.

- ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యధికంగా ఉండే

శ్రీకాకుళం జిల్లాకు ఏం చేశారు?

తూర్పుకాపు సామాజిక వర్గం కోటాలో ఎన్నోసార్లు మంత్రిగా ఉన్న కళా వెంకటరావు తూర్పుకాపుల సంక్షేమం కోసం ఏదైనా చేశారా అని బెల్లాన ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన తూర్పుకాపులు ఇతర జిల్లాల్లో ఉంటే వారికి బీసీ రిజర్వేషన్ లేక ఎన్నిఇబ్బందులు పడినా పట్టించుకోలేదని విమర్శించారు.

- కళా వెంకటరావు సొంత నియోజకవర్గంలోని సంకిలి నుంచి పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని తీసుకొచ్చి చీపురుపల్లి నియోజవకర్గంలోని ప్రజలకు అందించిన ఘనత తమ నాయకుడు బొత్స సత్యనారాయణకు దక్కిందన్నారు. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ఇక్కడి తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.83 కోట్లు నిధులు మంజూరు చేయించిన గొప్పనాయుడు బొత్స అని గుర్తు చేశారు.
- వైఎస్సార్ హయాంలో బొత్స సత్యనారాయణ చొరవతో తోటపల్లి కుడి ప్రధాన కాలువ మంజూరైందన్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూ, ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరులో బొత్స పాత్ర కీలకమైనదన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు చంద్రబాబు ఉత్తుత్తి శంకుస్థాపనలు చేస్తే గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనులు ప్రారంభించి తమ ప్రభుత్వం చివరి రోజు నాటికి 23 శాతం పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తుచేశారు.